
క్లుప్తంగా

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విబూధి వంటి వాటితో అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సహాయం అందిస్తున్న విద్యానాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడు మాజీ సర్పంచ్ చింతపూడి విజయ్‌భాస్కర్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి సోమవారం పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. చింతపూడి విజయ్‌భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో విద్యానాథరెడ్డి కనమంబేడులోని విజయ్‌భాస్కర్ ఇంటికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ దళిత నాయకుడైన విజయ్‌భాస్కర్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేశారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్‌సీపీ పార్టీ అండదండలు ఉంటాయని ఆయన తెలిపారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



విశేషాలంకరణలో స్వామివారు

సత్యవేడు: పల్లికొండేశ్వర దేవస్థానంలో విఘ్నేశ్వరస్వామి పూజ, శివసహస్ర నామార్చన, లక్ష బిల్వార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయం ప్రదోష మండపంలో వృషభవాహనంపై శివపార్వతులు ఉత్సవమూర్తుల విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తిరుపతి, తిరుత్తణి నుంచి 15 మంది అర్చకులు, వేదపండితులు వచ్చి లక్షబిల్వార్చన నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు మహాదీపారాధన చేశారు. ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. తిరుపతికి చెందిన విశాల్ చక్రవర్తికి కార్యనిర్వాహక కార్యదర్శి పి.లత ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేశారు.

రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన



రోడ్డుపై వరినాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

సత్యవేడు: మండలంలోని సత్యవేడు- ఊత్తుకోట మార్గంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, బురద చేరడంతో సీపీఎం ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో సోమవారం వరినాట్లు వేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రమేష్ మాట్లాడుతూ సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు 16 కిలోమీటర్లు దుస్థితికి చేరిందన్నారు. పలుమార్లు రోడ్డు మరమ్మతు విషయమై అధికారులు, కూటమి నాయకులను కోరినా పట్టించుకోకపోవడంతో వారికి కనువిప్పు కల్పించేందుకే రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపామన్నారు. ఈ కార్యక్రమల తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రఘునాథ్

సత్యవేడు: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రఘునాథ్ ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు తెలిపారు. సోమవారం బీబీఎస్ రెసిడెన్సీలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పార్టీ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా శేఖర్, సంయుక్తగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా చిన్నదొరై, కోశాధికారిగా గురవయ్య ఎన్నికయ్యారు. అలాగే ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా వినోద్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా సముద్రయ్య, మండల యూత్ అధ్యక్షుడిగా తమిళ అర్సన్, బీసీసెల్ మండల అధ్యక్షుడిగా వెంకటేష్, మైనారిటీ మండల అధ్యక్షుడిగా మస్తాన్ బాయ్, మహిళా మండల అధ్యక్షురాలిగా సుమలత, పట్టణ అధ్యక్షుడిగా అంబేడ్కర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకలి విద్యకు ఆటంకం కాకూడదు.. ఇదే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. పేద పిల్లలు కడుపు నిండా తినాలి..కళకళలాడుతూ ఇళ్లకు వెళ్లాలన్నది సర్కారు సంకల్పం. ముద్దకట్టిన అన్నం ఓ చోట..టమాట లేని గుడ్డు పులుసు మరో చోట.. కూర చారు కన్నా అధ్వానంగా ఇంకొచోట.. వెరసి చిన్నారులు పోషకాహారం కొరవడి కళ తప్పిన మొహాలతో ఇళ్లకు చేరుతున్నారు. పెరిగిన కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలతో నాణ్యమైన పోషకాహారం అందక వారి ఆరోగ్యానికి చేటు కలుగుతోంది.

మధ్యాహ్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు



విద్యార్థులకు అందని పోషకాహారం

- పెరిగిన నిత్యావరసర వస్తువుల ధరలు
- ముద్దకట్టిన అన్నం, చారులా కూర, టమాట లేని గుడ్డు పులుసు
- మెస్ బిల్లు పెంచని కూటమి ప్రభుత్వం
- వంటకాల్లో నాణ్యత పాటించని నిర్వాహకులు

ధరల పోటు.. ఆరోగ్యానికి చేటు

బుచ్చినాయుడుకండ్రిగ: నిత్యావసరాల ధరలు మండిపోతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంలో బడి రూపురేఖలను మార్చడమే కాకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేసింది. అందులో భాగంగానే ప్రతి రోజూ ఒక రకం భోజనం మెనూ ప్రకటించి, అందుకు తగ్గటుగానే నిధులను కేటాయించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బడ్జెట్‌ను పెంచడం లేదు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వహణ భారంగా మారి నిర్వాహకులు నాణ్యతకు తిలోదాకాలు ఇస్తున్నారు.

గతంలో రోజుకో పోషకాహారం

మండలంలో 51 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 5 జెడ్పీ ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలో 3700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులంతా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే. వారిలో ఏ ఒక్కరూ రక్తహీనతతో బాధపడకూడదని, పిల్లలందరూ ఆరోగ్యవంతులు ఉండాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెనూలో పలు మార్పులు చేసి మధ్యాహ్న భోజనం అందించింది. రోజుకు ఒక రకం వంటకంతోపాటు ఉడికించిన గుడ్డు, చిక్కి, రాగిజావ వంటివి అదనంగా అందిస్తూ వచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపడానికి ఆసక్తి చూపేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు మండుతున్నాయి. దీంతో వంట నిర్వాహకులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణ భారంగా మారింది. అంతే కాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నిచోట్ల వంట నిర్వాహకులను మార్చి తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విమర్శలున్నాయి.

పెండింగ్‌లో ఎండీఎం నిధులు

మధ్యాహ్న భోజనానికి చెల్లించాల్సిన నిధులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు మూడు, నాలుగు నెలలుగా నుంచి అందడం లేదు. దీంతో పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందించడానికి అవస్థలు పడుతున్నాయి. దీనికి తోడు ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో విద్యార్థులకు రుచికరమైన భోజనం వండలేకపోతున్నారు.

“

అప్పులు చేసి వడ్డిస్తున్నాం

కూరగాయల ధరలతోపాటు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణకు ప్రభుత్వం ఇస్తున్న డైట్ చార్జీలు సరిపోవడం లేదు. పిల్లల భోజనం కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇచ్చే చార్జీలు అప్పుల వడ్డీలు చెల్లించడానికి సరిపోతున్నాయి.

- రమణమ్మ, కారణి, భోజన నిర్వాహకురాలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలనకు వెళ్లిన సమయంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిత్యావసర ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని మాదృష్టికి తీసుకొస్తున్నారు. ధరలు పెంచాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

-ఎంఈఓ రవీంద్రనాథ్

పెరిగిన నిత్యావసరాల ధరలు

ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఒక్కొక్కరికి రూ.5.88, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రూ.8.57ను నిర్వాహకులకు అందిస్తోంది. ప్రస్తుతం నిత్యావసర సరుకులతోపాటు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. మరి ఏవిధంగా సరుకులను కొని భోజనం అందించాలని నిర్వాహకులు వాపోతున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సన్నబియ్యం అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు రేషన్ బియ్యాన్నే సరఫరా చేస్తున్నారు.



కూరగాయలు లేని వెజ్ బిరియాని





స్టోర్ బియ్యంతో వండడంతో ముద్దకట్టిన అన్నం, టమాట లేని గుడ్డు పులుసు

పట్టాలివ్వాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తహానగర్‌లో తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరాజుకు రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఆలత్తూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు భూసమస్యలను ఏకరువు పెట్టారు. ఆలత్తూరు రెవెన్యూ పరిధిలోని తహానగర్‌లో 15 మంది రైతులు 40 ఏళ్లుగా 20 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. అధికారులు స్పందించి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్, సీపీఐ మండల కార్యదర్శి కత్తిధర్మయ్య, వీఆర్ఓ భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సత్యవేడు: ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ్యులను రెగ్యులర్ చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్రకార్యదర్శి ఎం, చెందులయ్య, డిపో కార్యదర్శి వి. బాబు కోరారు. శనివారం ఎన్ఎంయూ భవనంలో కార్మికులు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కాల్ ఆన్ డ్రైవర్లు 25 మంది, డిపో చైర్మన్ టి.సుధాకర్, ఎం.గోపాల్, ఎన్ కమలేనాథ్, ఎన్. కరీముల్లా, హెచ్ఎం.రాజు, పి.ఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

రామచరితే విశ్వానికి ఆదర్శం

తిరుపతి కల్చరల్ : శ్రీరాముని జీవితమే విశ్వానికి ఆదర్శమని ప్రవచన కర్త గరికపాటి రమేష్‌బాబు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం అన్నమాచార్య కళా మందిరంలో ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ప్రవచన కర్త మాట్లాడుతూ వాల్మీకి రామాయణంలోని కిష్కింధకాండను వినసొంపైన పద్యాలతో వివరించారు. అనంతరం ప్రవచనకర్తను రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు, కాంబాకం గ్రామాల్లో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. పాండూరులోని శ్రీ రామాలయ మండపం, కాంబాకంలోని గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో రెండు బిగ్‌బస్‌ల్లో మొబైల్ క్యాన్సర్స్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌కు సంబంధించి ఉచితంగా పరీక్షలను చేశారు. ఈ వైద్యశిబిరంలో చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు అనిత, లావణ్య, శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు హరిత, చైతన్య భాను, స్థానిక సర్పంచులు దీప, కవిత, పంచాయతీ కార్యదర్శి జయశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ బేబి, ఏఎన్ఎం కామేశ్వరి పాల్గొన్నారు.



కరకంబాడి ఇందిరానగర్‌లో క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి ఇందిరానగర్ రాస్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం ఆదేశానుసారం టాటా ట్రస్ట్ వారిచే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన మహిళలు, పురుషులకు డాక్టర్ వెంకయ్య బాబు బృందం క్యాన్సర్‌పై పూర్తి అవగాహన కల్పించి, అందరికీ పరీక్షలు చేశారు.



పెద్దపాండూరులో..

ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలను తెలియజేశారు. అలాగే రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ సిబ్బంది హేమంత్ కుమార్, రెడ్డికుమారి, అమరావతి, మహేంద్ర, రాస్ మహిళా జ్యోతి ట్రస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఫీల్డ్ ఆఫీసర్ గిరిప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల రిలే నిరాహారదీక్ష

సత్యవేడు: మండలంలోని పాలగుంట వద్ద ఉన్న కాఫ్రికాన్ ఫుడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులను తొలగించడంతో వారు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. సోమవారం టీఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి రాము ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన ఉధృతం చేశారు. 22 ఏళ్లుగా స్థానికులు 45 మంది కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. ఫ్యాక్టరీ నష్టాలో ఉందన్న కారణంతో నిర్లక్ష్యంగా తొలగించడం సమంజసం కాదన్నారు. పరిహారం మొక్కుబడిగా చెల్లించి, వదిలించుకోవాలని యాజమాన్యం చూస్తోందని ఆరోపించారు. ఫ్యాక్టరీలోని సరుకులు దొడ్డిదారిన తరలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాండురంగయ్య, మారిముత్తు, రవికుమార్, మణిబాబు, పయని, జార్జ్, ప్రసాద్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



పాలగుంటలో ఫ్యాక్టరీ ముందులో ఆందోళన చేస్తున్న కార్మికులు

పాసు పుస్తకాల్లో తప్పిదాలు సవరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాలు అందజేస్తున్న బాధితులు

సత్యవేడు: ఇరుగుళం పరిధిలోని 13 మంది రైతులకు చెందిన భూమి సుమారు 5 ఎకరాలు పైగా మరొకరి పేరున(బి.మురళీబాబు) ఆన్‌లైన్ పాసు పుస్తకంలతో నయోదైందని, దాన్ని సవరించాలని రైతులు తహసీల్దార్ టి.సుబ్రమణ్యానికి ఫిర్యాదు చేశారు. సోమవారం ఇరుగుళం పంచాయతీలో సర్పంచ్ శేఖర్ అధ్యక్షతన, నోడల్ అధికారి, డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహేశ్వర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రమ, యశ్వంత్, సుప్రజ, బి. మురళిబాబు, వెంకటరమణ, తదితరులకు చెందిన భూమిని గ్రామానికి చెందిన ఒక రైతు తన పేరున ఆన్‌లైన్‌లో పాసుపుస్తకం ఎలా తయారు చేయించుకున్నారని ప్రశ్నించారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ తప్పుడు పాసుపుస్తకం చేశారని ఆరోపించారు. రికార్డులు పరిశీలించి, న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఎంఈఓ కే.రవి, మండల సర్వేయర్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు హరీష్, లోకేష్, రాజేష్, వీఆర్వోలు నాగార్జున, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ రవి మనోహరాచారి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో బుధవారం ఏడుగంగమ్మల జాతర జరగనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై సోమవారం రాత్రి లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఏడుగంగమ్మలు కొలువుదీరే ప్రాంతాలను పరిశీలించారు. జాతర ఎక్కడ నుంచి ఎక్కడి వరకు జరుగుతుంది.. ఏయే ప్రాంతాల్లో ఎంతమంది బందోబస్తు అవసరమనే విషయాలపై చర్చించారు. మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తిలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

పరిహారం ఇప్పించాలని వినతులు



ఏర్పేడు: పాగాలి గ్రామసభలో పరిహారం కోసం విన్నవిస్తున్న రైతులు



రేణిగుంట: కరకంబాడిలో సమస్యలు వింటున్న తహసీల్దార్

రేణిగుంట: ఏర్పేడు మండలం పాగాలి రెవెన్యూ పరిధిలో ఇంటి స్థలాలకు ఇచ్చిన భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పరిహారం వెంటనే ఇప్పించాలని రైతులు వేడుకున్నారు. పాగాలి, పంగూరులలో తహసీల్దార్ భార్గవి ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. జగనన్న ఇళ్ల పథకానికి పొలాలు ఇచ్చామని, ఇంత వరకు నష్ట పరిహారం ఇవ్వలేదని తెలిపారు. పలువురు రైతులు వినతిపత్రాలను అందజేశారు. డీటీ రోజారమణి, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంటలో..

రేణిగుంట మండలం కరకంబాడి సచివాలయం–1 పరిధిలో సోమవారం తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇంటి స్థలాలు ఇవ్వాలని కొందరు వినతులు సమర్పించారు. కరకంబాడి హైస్కూల్‌కు సంబంధించిన 2 ఎకరాలు ఆటస్థలాన్ని కొందరు నాయకులు ఆక్రమించి ఇళ్లు కట్టి అమ్ముకుంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి హరినాథ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

మా ఊరి రోడ్డు దుస్థితి పట్టదా?

వరదయ్యపాళెం: 'వర్షమొస్తే అడుగు తీసి అడుగు వేయలేని దుర్భర పరిస్థితిలో ఉన్నాం.. ఎన్నికల సమయంలో రోడ్లు వేస్తాం..మురుగునీటి కాలువలు నిర్మిస్తాం.. అని హామీల మీద హామీలు గుప్పిస్తారు.. ఎన్నికల తర్వాత ముఖం చాటేస్తారు.' అని వరదయ్యపాళెం పంచాయతీ వడ్డిపాళెం గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీ పరిధిలోని వడ్డిపాళెంలోని ప్రధాన వీధి వర్షపునీరు నిల్వ చేరడంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ పాలకులకు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు రోడ్డు నిర్మించాలని పలుసార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా స్పందన లేదని ఆరోపించారు. ఏటా తంతుగా ఇంటి పన్నులు వసూలు చేస్తారే తప్ప స్థానికంగా అవసరమైన మౌలిక వసతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మురికికూపంలా వడ్డిపాళెంలోని ఓ వీధి

మ్యుటేషన్ సమస్యలు పరిష్కరించండి

వరదయ్యపాళెం: సెటిల్‌మెంట్ పట్టా భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న మ్యుటేషన్ సమస్యలను పరిష్కరించాలని చిలమత్తూరు గ్రామానికి చెందిన రైతులు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. సోమవారం చిలమత్తూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మ్యుటేషన్ దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదులో ఆలస్యమవుతున్నాయని తెలిపారు. రెవెన్యూ అధికారుల తప్పిదంతోనే అసలైన పట్టాదారు స్థానంలో మరొకరి పేర్లు నమోదు చేయడంతో ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆన్‌లైన్ నమోదు చేయాలని కోరారు. అలాగే ఇళ్ల స్థలాల కోసం పలువురు అర్జీలు అందజేశారు. ఆ సమావేశానికి హాజరైన డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య రైతుల విన్నపాలను తక్షణమే పరిష్కరించడానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణ, ఆర్ఐ శివకుమార్, వీఆర్వో చలపతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో సమస్యలను విన్నవిస్తున్న స్థానికులు

తడ-శ్రీకాళహస్తి రోడ్డుకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమైన తడ–శ్రీకాళహస్తి రోడ్డు గురించి ×రహదారుణాల్లు అన్న శీర్షికన సాక్షిదినపత్రికలో ఈ నెల 4వ తేదీన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన రోడ్లు భవనాల శాఖ ఛిద్రమైన శ్రీకాళహస్తి–తడ రోడ్డు మరమ్మతుకు సిద్ధం అయ్యింది. దీంతో రెండు రోజులుగా ఆ మార్గంలో రోడ్డుపై పడిన గుంతలకు ప్యాచ్‌లు వేసేందుకు కంకర తోలుతూ చదును చేస్తున్నారు. దానిపై తారుతో అతుకులు వేయనున్నట్లు ఆర్ అండ్ బీ శాఖ ఏఈ తెలిపారు.



తడ-శ్రీకాళహస్తి మార్గంలో ప్యాచ్‌లు వేస్తున్న సిబ్బంది